తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ఆలసత్వం లేకుండా సమస్యలకు సత్వర పరిష్కారం

చిత్తూరు, డిసెంబర్ 22 ప్రభాతవార్త:



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలకు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్రపాడెల్, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్లు విజయలక్ష్మి, కరుణ కుమారిలు, కలెక్టరేట్ ఎఓ వాసుదేవన్‌లు పాల్గొని సమస్యలపై అర్జీలు తీసుకున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 412 అర్జీలు

తిరుపతి కలెక్టరేట్, డిసెంబర్ 22 ప్రభాతవార్త :



ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్)లో జిల్లా కలెక్టర్ అర్జీదారులకు గౌరవ ప్రదంగా వచ్చికి ఏర్పాటు చేసి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వారికి త్రాగునీటి సౌకర్యం మెడికల్ క్యాంపు ఏర్పాటు, గ్రామాల నుండి వచ్చే వారికి కావలసిన సదుపాయాలను కల్పించి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. ఆర్జీలకు వేగవంతంగా పరిష్కారం చూపాలని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు స్పెషల్ డిప్యూటీ కల్లెక్టర్లు దేవేందర్ రెడ్డి, రోజ్ మాండ్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు.

### "వైకుంఠ"దర్శనాలు

## సామాన్యభక్తులకే ప్రాధాన్యత

**-ఏఐతో క్యూలైన్ల నియంత్రణ పర్యవేక్షణ**

**-ఆ మూడురోజులు నిర్దేశిత సమయానికే ప్రవేశించాలి**

**-వైకుంఠదర్శనాల ఏర్పాట్లపై మంత్రుల సబ్‌కమిటీ**



తిరుమల, డిసెంబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:

ధనుర్మాసంలో శ్రీవారి ఆలయంలో పవిత్రమైన వైకుంఠద్వారదర్శనాలను సామాన్యభక్తులకే అధిక ప్రాధాన్యత కల్పించినట్లు రాష్ట్రమంత్రులు వెల్లడించారు. భక్తులు కూడా సంయమనంతో,ప్రశాంతంగా దర్శన టోకెన్లలో నిర్ధేశించిన రోజు,సమయానికి సూచించిన ప్రాంతాల్లో క్యూలైన్లలోనికి ప్రవేశించాలని సూచించారు. భక్తులకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఆ పదిరోజుల్లో 182 గంటల దర్శన సమయంలో 164గంటలు సామాన్యభక్తులకే దర్శనాలు చేయిస్తామన్నారు. తొలిమూడురోజులకు 1.89లక్షలమందికి ఈ డిప్‌లో దర్శన టోకెన్లు కేటాయించడం జరిగిందన్నారు.ఈ ఏడాది ఏఐ సాంకేతికతతో క్యూలైన్ల పర్యవేక్షణ, వేచిఉండే సమయాన్ని అంచనా వేస్తూ క్యూలైన్ల నిర్వహణ చేస్తారన్నారు. ఈ ఏడాది ప్రశాంతంగా భక్తులకు వైకుంఠ దర్శనాలు చేయించేందుకు ముఖ్యమంత్రి ఆదేశాలతో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, దేవాదాయశాఖ మంత్రి ఆనంరామనారాయణరెడ్డి, తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి,రాష్ట్రరెవెన్యూశాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్ ముగ్గురు కలసి సోమవారం రాత్రి తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, దేవాదాయశాఖ కార్యదర్శి హరిజవహర్‌లాల్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు , సివిఎస్‌ఓ కెవి మురళీకృష్ణ , సిపిఆర్‌ఓ డాక్టర్ తలారి రవి, పిఆర్‌ఓ నీలిమ, అదనపు ఎస్పీలు రవిమనోమహరచారి, రామకృష్ణ, టిటిడి విభాగాల ఉన్నతాధికారులు, పోలీసు అధికారులతో కలసి పలు అంశాలపై సమీక్షించారు. ఈ ఏడాది పదిరోజుల వైకు:ఠద్వార దర్శనాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మంత్రులు తెలిపారు. ఎక్కడా చిన్నపాటి అసౌకర్యం, ఇబ్బందులు లేకుండా భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందన్నారు.భక్తులకు విరివిగా అన్నప్రసాదాలు, తాగునీరు. పాలు,కాఫీ అందించడం జరుగుతుందన్నారు. అన్నివర్గాల భక్తులను దృష్టిలో ఉంచుకుని సంయమనంతో స్వామివారిని దర్శించుకోవాలని మంత్రులు విజ్ఞప్తి చేశారు. భక్తులకు టిటిడి ఉద్యోగులు, సేవకులు నిబద్దతతో సేవలదించాలని సూచించారు. తొలిమూడురోజులకు ఆన్‌లైన్‌లో టోకెన్లు అందుకున్న భక్తులు కేటాయించిన సమయానికి తిరుమలకు చేరుకుని క్యూలైన్లలో రావాలని రాష్ట్రమంత్రులు విజ్ఞప్తి చేశారు. జనవరి 2నుండి 8వరకు సాధారణ సర్వదర్శనంలో భక్తులకు వైకుంఠద్వార దర్శనాలు చేయిస్తామన్నారు.

## ఎల్‌విఎం3-ఎం6 రాకెట్ ప్రయోగానికి కౌంట్‌డౌన్

### - రేపు బ్లూబర్డ్ ఉపగ్రహ ప్రయోగం



సూళ్లూరుపేట, డిసెంబర్ 22 ప్రభాతవార్త

ఇస్రో బాహుబలి రాకెట్ ఎల్‌విఎం3-ఎం6 ద్వారా అమెరికాకు చెందిన భారీ ఉపగ్రహం బ్లూబర్డ్‌ను ప్రయోగించేందుకు మంగళవారం ఉదయం 8 గంటల 54 నిమిషాలకు కౌంట్‌డౌన్ ప్రారంభం కానుంది. కౌంట్‌డౌన్ 24 గంటల పాటు కొనసాగి బుధవారం ఉదయం 8 గంటల 54 నిమిషాలకు రాకెట్ ప్రయోగం జరగనుంది. ఈ ప్రయోగం మూడు దశల్లో ఉంటుంది. నింగిలోకి ఎగిసిన అనంతరం 520 కిలోమీటర్లు ప్రయాణించి 15 నిమిషాల 7 సెకన్లలో బ్లూబర్డ్ బ్లాక్-2 ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెడుతుంది. ఇందుకు సంబంధించి శ్రీహరికోటలో శాస్త్రవేత్తలు రాకెట్ అనుసంధాన ప్రక్రియ, ఇంధనం నింపు ప్రక్రియను పూర్తి చేశారు. ఎంఆర్ఆర్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. దీంతో రాకెట్ ప్రయోగానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లవుతుంది.

ప్రయోగ వేదికపై ఎల్‌విఎం3-ఎం6 రాకెట్

## శ్రీచెంగాళమ్మ సన్నిధిలో ఇస్రోఛైర్మన్

సూళ్లూరుపేట, డిసెంబర్ 22 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవిని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ సోమవారం దర్శించుకున్నారు. శ్రీహరికోటలో నిర్వహించే రాకెట్ ప్రయోగం నేపథ్యంలో ఇస్రో ఛైర్మన్‌గా ఉన్న వారు శ్రీచెంగాళమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ శ్రీహరికోట వేదికగా ప్రయోగించనున్న ఎల్‌విఎం3-ఎం6 రాకెట్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఛైర్మన్ వి.నారాయణన్ అమ్మణ్ణిని దర్శించుకున్నారు. దేవస్థానానికి వచ్చిన ఆయనకు వేదపండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజల అనంతరం



తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌డి గ్రూప్ మేనేజర్ గోపీకృష్ణ ఉన్నారు.

## ఇస్రో చరిత్రలో భారీ వాణిజ్య ఉపగ్రహ ప్రయోగం

**- ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ వెల్లడి**

సూళ్లూరుపేట, డిసెంబర్ 22 ప్రభాతవార్త

*భారత భూభాగం నుంచి ఇస్రో చరిత్రలో భారీ ఉపగ్రహ వాణిజ్య ప్రయోగాన్ని ఈ నెల 24న శ్రీహరికోట వేదికగా నిర్వహించనున్నట్లు ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. సోమవారం శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవిని దర్శించుకున్న అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడారు. మంగళవారం ఉదయం 8 గంటల 54 నిమిషాలకు కౌంట్‌డౌన్ ప్రారంభమై 24 గంటల పాటు కొనసాగి బుధవారం ఉదయం 8 గంటల 54 నిమిషాలకు శ్రీహరికోట లోని రెండవ ప్రయోగ వేదిక నుంచి ఎల్‌విఎం3-ఎం6 రాకెట్ ప్రయోగం జరుగుతుందన్నారు. ఈ రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన 6,500 టన్నుల బరువు గల బ్లూబర్డ్ బ్లాక్2 ఉపగ్రహాన్ని రోదశిలోకి ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఈ ఉపగ్రహం టెలి కమ్యూనికేషన్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తుందని, 4జి, 5జి సిగ్నల్స్‌ను నేరుగా నెట్‌వర్క్‌లేని చోట కూడా మొబైల్‌కు అందజేసే సామర్థ్యం వస్తుందన్నారు. ప్రస్తుతం ప్రయోగిస్తున్న ఎల్‌విఎం3 రాకెట్ సిరీస్‌లో ఇది 9వ ప్రయోగమని తెలిపారు. ప్రధాని నరేంద్రమోడీ ఇస్తున్న ప్రోత్సాహంతో ఇస్రో రోదశిలో తిరుగులేని శక్తిగా తయారవుతుందని నారాయణన్ చెప్పారు. 2026లో పిఎస్ఎల్‌వి ప్రయోగం, గగన్‌యాన్‌లో భాగంగా రెండు మానవ రహిత ప్రయోగాలు, 2027లో మానవ సహిత ప్రయోగం ఉంటుందని తెలిపారు. భవిష్యత్‌లో చంద్రయాన్-4, 5, వీనస్ ఆర్బిట్ మిషన్‌తో పాటు మరిన్ని పెద్ద ప్రయోగాలు ఉండేవిధంగా ప్రణాళికలు రూపొంది స్తున్నట్లు చెప్పారు.*

## తిరుచానూరు శ్రీనివాస ఆలయానికి వెండి కాసుల హారం విరాళం

తిరుచానూరు డిసెంబర్ 22 ప్రభాతవార్త

తిరుచానూరులోని టిటిడి అనుబంధ ఆలయమైన శ్రీనివాస ఆలయానికి తిరుచానూరుకు చెందిన డి. సాంబశివరావు 600 గ్రాముల వెండి కాసుల హారాన్ని సోమవారం విరాళంగా అందించారు.ఈ మేరకు వెండి కాసుల హారాన్ని టిటిడి అర్చకులు బాబు స్వామి, అధికారులు ముని చెంగల్ రాయులు,ప్రసాద్ లకు దాత అందజేశారు. అనంతరం దాతకు స్వామి వారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలను అందించారు.



## బాధ్యత, సేవాభావంతో పోలీసు విధులు

**- ట్రైనీ కానిస్టేబుళ్ళ శిక్షణా ప్రారంభోత్సవంలో ఎస్పీ తుషార్ డూడి**

చిత్తూరు, డిసెంబర్ 22 ప్రభాతవార్త:



పోలీసు ఉద్యోగం ఉపాధి మాత్రమే కాదని, ప్రజల పట్ల బాధ్యతతో కూడిన సేవా భావంతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ తుషార్ డూడి పేర్కొన్నారు. జిల్లా పోలీసు శిక్షణా మైదానంలో సోమవారం స్టైఫెండరీ కేడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ళకు 9 నెలల శిక్షణా కార్యక్రమంను ఎస్పీ తుషార్ డూడి ప్రారంభించారు. ఈ శిక్షణకు శ్రీకాకుళం జిల్లా నుండి 61 మంది, విజయనగరం జిల్లా నుండి 78 మంది ట్రైనీ కానిస్టేబుళ్ళు హాజరయ్యారు. వీరందరికి 9 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్బంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులు, మారుతున్న నేర ధోరణులు, ఆధునిక సవాళ్ళను దృష్టిలో వుంచుకుని డిజిపి కార్యాలయం తాజా అంశాలతో కూడిన శిక్షణ కరికులం పంపిందన్నారు. శిక్షణా కాలంలో ప్రతి ఒక్కరు క్రమశిక్షణ, సమయపాలన, నిబద్దత అత్యంత ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ ఎస్పీ, అడ్మిన్ ఇన్‌ఛార్జీ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, చిత్తూరు డిఎస్పీ సాయినాథ్, డిటిసి డిఎస్పీ జె.రాంబాబు, ఏఆర్ డిఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌భాషాలు, డిటిసి ఇన్స్‌పెక్టర్ అమరనాథరెడ్డి, ఆర్ఐలు చంద్రశేఖర్, వీరేష్, ట్రైనింగ్ సెంటర్ ఇండోర్, అవుట్‌డోర్ అధికారులు పాల్గొన్నారు.

## కర్ణాటకనుంచి కృష్ణగిరి జిల్లాలోకి నలభై ఏనుగులు

**- ఏనుగుల దారి మళ్లింపుకు తమిళ అధికారుల యత్నాలు !!**



హోసూరు ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

కుప్పం, డిసెంబర్ 22 ప్రభాతవార్త

కర్ణాటకలోని బన్నేరు ఘట్ట అటవీ ప్రాంతం నుంచి కుప్పం సరిహద్దుల్లోని తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా హోసూరు అటవీ ప్రాంతంలోకి సుమారు నలభైకి పైగా ఏనుగులు గుంపులుగా విడిపోయి ప్రవేశించినట్లు తమిళనాడు అటవీ అధికారులు గుర్తించారు. ఈ ఏనుగులు హోసూరు సమీపంలో ఉన్న సనమావు అటవీ ప్రాంతంలో ఉన్నాయని సమాచారం. కాగాఈఏనుగులను కసబ అటవీ ప్రాంతం నుంచి మరలా కర్ణాటకలోని అటవీ ప్రాంతంలో తరిమేసేందుకు తమిళనాడు అటవీ అధికారులు చర్యలు చేపట్టారు. కాగా సింకిరిపల్లి, బోతిచిపలి , ఉద్దనపల్లి, జక్కేరి, ఒన్నుక్కురై, కొల్లాటి గ్రామాల సమీపంలో ఈ ఏనుగుల గుంపు రైతులు సాగుచేసిన రాగి, టమోటా, బీన్స్ పంటలతో పాటు టెంకాయ చెట్లను ధ్వంసంచేసినట్లు తమిళనాడు అటవీ అధికారులు పేర్కొన్నారు. ఈగుంపు నుంచి ఐదు ఏనుగులు ఆహార అన్వేషణలో భాగంగా సెన్నత్తూర్, కసవగట్ట ప్రాంతాలకు చేరుకోగా అటవీ అధికారులు వాటిని గుర్తించి మరలా వారిని హోసూరు అటవీ ప్రాంతంలోకి తరిమేశారు. కాగా హోసూరు ప్రాంతంలో ఏనుగులుభారీగా రావడంతో అక్కడి అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలు, రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచనలు చేస్తున్నారు.పదిహేను మంది దాకా అటవీ అధికారులు ఎప్పటికప్పుడు ఏనుగుల జాడను పసిగడుతూ వాటి దారి మళ్లింపుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

### ననియాలలో పంటపొలాలపై ఏనుగుల దాడులు

రామకుప్పం,డిసెంబర్ 22 ప్రభాతవార్త

మండలంలోని ననియాల తాండా అటవీ ప్రాంతంలో జంట ఏనుగులు పంటలపైదాడులు కొనసాగిస్తున్నాయి. మరో ఒంటరి ఏనుగు కూడా పంద్యాలమడుగు అటవీ సరిహద్దు ప్రాంతాల్లో సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తోంది. అటవీ అధికారులు అటవీ సరిహద్దు గ్రామాల్లో రైతులు, ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. రాత్రిపూట ఇళ్లనుంచిబయటకు రావద్దని, పొలాల వద్దకు వెళ్లరాదని సూచించారు.

## గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు పక్కా చర్యలు

**- జిడినెల్లూరు నియోజకవర్గానికి రూ.63 లక్షలు విలువైన 20 ఇ-ఆటోలు ప్రారంభించిన ఎంపీ దగ్గుమళ్ళ**

చిత్తూరు, డిసెంబర్ 22 ప్రభాతవార్త:



గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పక్కా చర్యలు తీసుకుంటున్నాయని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో సోమవారం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు కలెక్టర్ సుమిత్‌కుమార్, ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్‌లతో కలిసి రూ.63 లక్షల ఎంపి నిధులతో కొనుగోలు చేసిన 20 ఇ-ఆటోలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ చిత్తూరు పార్లమెంటు స్థానం పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని మేజర్ పంచాయతీలు, గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. మిగిలిన నియోజకవర్గాలకు భవిష్యత్తులో ఇ-ఆటోలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ మాట్లాడుతూ జిడినెల్లూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ దగ్గుమళ్ళ సహకారం మరువలేనిదన్నారు. సిఎం ఆశయమైన స్వర్ణాంధ్రా-స్వచ్ఛాంధ్ర సాధనలో భాగంగా మెరుగైన పారిశుధ్య కార్యక్రమాలను గ్రామాల నుండి అమలు చేస్తామన్నారు. ఇ-ఆటోల ద్వారా తడి, పొడి చెత్త వేరు వేరుగా సేకరించడానికి వీలు అవుతుందన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఎంపీ లాడ్స్ కింద ఎస్సీ, బిసీ హాస్టళ్ళు, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల్లో మౌళిక వసతులు కల్పించడం జరుగుతోందన్నారు. జిల్లాలో ఎంపి లాడ్స్ కింద రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, ఇటీవల చిత్తూరు బిఎస్ కన్నన్ కళాశాలలో ఎంపీ లాడ్స్ రూ.30 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందని, ఈ ఆర్థికసంవత్సరంలో ఎంపీలాడ్స్ కింద 9 ప్రాజెక్టులను విజయవంతంగా అమలు చేశామన్నారు.

## మరింత ఉత్సాహంగా పనిచేద్దాం : కమిషనర్ మౌర్య

తిరుపతి,డిసెంబర్ 22ప్రభాతవార్త:

అవార్డులతో మరింత బాధ్యత పెరిగిందని, అందరూ కలసి కట్టుగా మరింత ఉత్సాహంగా పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. విద్యుత్ ఆదా చేయడంలో రాష్ట్రంలోనే మొదటిస్థానం లో నిలిచిన తిరుపతి నగరపాలక సంస్థ సెషా అవార్డు సాధించింది. విజయవాడలో అవార్డును అందుకున్న డిప్యూటీ కమిషనర్ అమరయ్య సోమవారం కమిషనర్ ఎన్.మౌర్యను కలిసి అందజేశారు. ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతూ అవార్డులు రావడంతో మనకు గుర్తింపుతో పాటు బాధ్యత పెరిగిందని అన్నారు. అధికారులు, సిబ్బంది కృషి వల్లే అవార్డులు వస్తాయని



అన్నారు. అందరం కలసి కట్టుగా పనిచేస్తే తిరుపతి నగరపాలక సంస్థకు మరిన్ని అవార్డులు వస్తాయని తెలిపారు. అన్ని విభాగాల అధికారులు చక్కటి సమన్వయంతో పనిచేయాలని, భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని అకాంక్షి ంచారు. అవార్డు రావడం పట్ల పలువురు కమిషనర్ కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, ఎలక్ట్రికల్ డి.ఇ. శిల్ప, పలువురు అధికారులు ఉన్నారు.

## ఆల్తూరుపాడు రిజర్వాయర్‌కు త్వరలో నిధులు

**- ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ**



వెంకటగిరి, డిసెంబరు 22, ప్రభాతవార్త

నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సోమవారం అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. డక్కిలి మండలంలోని ఆల్తూరుపాడు రిజర్వాయర్ నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని ఆయన సీఎంని కోరారు. ఎన్నికల ముందు వెంకటగిరి పర్యటనలో ఆల్తూరుపాడు రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామని సీఎం ఇచ్చిన హామీని ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సుమారు 1.70 లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు తిరుపతి, తిరుమల, శ్రీకాళహస్తి ప్రాంత ప్రజలకు శాశ్వతంగా తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని వివరించారు. దీనిపై సీఎం చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా వెంకటగిరి పట్టణంలో దీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోని గోషా ఆసుపత్రి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని సీఎం స్పష్టం చేసినట్లు చెప్పారు. గొడ్డేరు ఆనకట్ట నిర్మాణం, కావల్యానది అభివృద్ధికి కూడా నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కైవల్యానదికి వరదలు వచ్చినప్పుడు పట్టణంలో నదికి ఇరువైపులా తీవ్రంగా కోత జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకువెళ్లారు.

## సామాన్యభక్తులకు బస, భోజన వసతులు: ఉత్సవాలకు ప్రాధాన్యత

**గుడిమల్లం మొదటి ధర్మకర్తల మండలి సమావేశంలో తీర్మానాలు**

ఏర్పేడు,డిసెంబర్ 22 ప్రభాతవార్త

శైవ క్షేత్రంగా విరాలజిల్లుతున్న శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరాయలానికి ప్రపంచ వ్యాప్త ప్రాధాన్యత ఉందని ఇక్కడకు వచ్చే భక్తులకు ప్రతి రోజూ భోజన వసతితో పాటు బస సదుపాయాలను ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి నిధులు సాధించాలని సోమవారం జరిగిన ధర్మకర్తల మండలి మొదటి సమావేశంలో తీర్మానించారు.ఆలయ వసతి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఛైర్మెన్ బత్తలగిరినాయుడు అధ్యక్షత వహించగా సభ్యుల ప్రశ్నలకు ఆలయ ఇఓ రామచంద్రారెడ్డి సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా సమావేశంలో బత్తల గిరి నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఈ ఆలయ అభివృద్ధికి ఎంతో చొరవ తీసుకుంటున్నారన్నారు. మహాశివరాత్రికి ముందు ఈ ఆలయానికి రోడ్డు మార్గం సరిగ్గా ఉండేది కాదని జిల్లా కలెక్టర్‌ను ఒప్పించి ఎంఎల్‌ఏ చక్కటి రోడ్డును ఏర్పాటు చేసినట్లు వివరించారు.దాంతో ఇక్కడకు శ్రీకాళహస్తి,తిరుపతి నుంచి వచ్చే భక్తులు, విఐపిల తాకిడి



పెరిగిందన్నారు. అంతేకాక ఏడాదిలో దేశ వ్యాప్తంగా ప్రచారం చేసారన్నారు. దాంతో మహారాష్ట్రకు చెందిన ఉప ముఖ్యమంత్రి కుమారుడు,ఎంపి ఇక్కడ అన్నదాన సత్రం భవనం నిర్మాణాలకు రూ.50లక్షల్లు బరోసా ఇచ్చి రూ.25లక్షలు అందించారన్నారు.ఈ సొమ్ములతో ఎకరాభూమి కొనుగోలుకు నిర్ణయించినట్లు సమావేశం దృష్టికి తెచ్చారు.అలాగే ప్రతి రోజూ భక్తులకు భోజన సదుపాయం కల్పించాలని సమావేశం తీర్మానించారు.

**ఉత్సవాలకు ప్రాధాన్యత:**

గుడిమల్లం ఆలయం ప్రస్తుతం పురావస్థుశాఖ పర్యవేక్షణలో ఉందన్నారు. ఆలయాన్ని మరమ్మత్తులు చేపట్టామని సాధారణంగా ఆంగ్ల సంవత్సరాదికి ఇక్కడకు భక్తులు విశేష సంఖ్యలో వస్తారని కాబట్టి ప్రత్యేకె ఏర్పాట్లు చేయాలని తీర్మానించారు. అలాగే జనవరి 3న ఆరుద్ర నక్షత్రం కాబట్టి కొత్తగా ఆ రోజు స్వామి వారికి వస్త్ర సేవ,అభిషేక అలంకరణను శాసనసభ్యులు సుధీర్‌రెడ్డి ప్రతిపాదించిన అంశాన్ని తీర్మానం చేసారు.ప్రతి నిత్యం ప్రదోష కాలంలో సాయంత్రం 5-6 గంటలలోపు అభిషేకం జరుపుటకు మరో తీర్మానం చేసినట్లు వివరించారు. సమావేశంలో సభ్యులు టి.బాబు,పి.అరుణ,టి.హంస, జి.గీత,బి.రాజ్‌కుమార్,టి.రేవతి, ఏ.ఉష, అర్‌కిరణ్‌కుమార్,కె.నిరంజన్ పాల్గొన్నారు. సమావేశంలో ఇఓ రామచంద్రారెడ్డి సభ్యుల సందేహాలను నివృత్తి చేసారు.

## గణిత ప్రతిభ చాటిన మహనీయుడు రామానుజన్

– బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ డా॥ బిసి నాగరాజ్



**కుప్పం, డిసెంబర్ 22 ప్రభాతవార్త** భారతీయ గణిత ప్రతిభను ప్రపంచానికి చాటిన మహనీయుడు శ్రీ శ్రీనివాస రామానుజన్ అని బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ డా॥బిసి నాగరాజ్ పేర్కొన్నారు. సోమవారం కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో జాతీయ గణితశాస్త్ర దినోత్స వంనుఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం డా॥ బిసి నాగరాజ్ మాట్లాడుతూవిద్యార్థులు రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకుని కష్టపడి అధ్యయనం చేస్తూ పరిశోధన దృక్పధాన్ని అలవర్చుకో వాలన్నారు. పట్టుదలతో గణిత ంలో అపూర్వమైన పరిశోధనలుచేసిన రామానుజన్ విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన పరిశోధనలు గణితంలో విప్లవాత్మక మార్పులకుదారి తీశాయన్నారు. అనంతరం డాక్యుమెంటరీ ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, ఆర్అండ్‌డి డైరెక్టర్ డా॥ కోదండరామయ్య, హెచ్ఒడిలు మాధవన్, శరవణ, అధ్యాపకులు, పిఆర్వో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## గ్రామాల అభ్యున్నతికి సిఎం చంద్రబాబు చర్యలు - ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం



**కుప్పం, డిసె ంబర్ 22 ప్రభాతవార్త** కుప్పం నియోజకవర్గంలోని గ్రామాల అభ్యున్నతికి సిఎం చంద్రబాబునాయుడు చర్యలు చేపట్టారని ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥బిఆర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం చిన్నశెట్టిపల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన సిమె ంట్ రోడ్డు నిర్మాణంకువారు భూమిపూజ చేసి పనులుప్రారంభించారు. 8.30లక్షల వ్యయంతో నూతనరోడ్డు నిర్మిస్తున్నట్లు వారు చెప్పారు. కుప్పం నియోజకవర్గంలో ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, క్లస్టర్ ఇన్‌చార్జులు బేటప్ప నాయుడు,కన్నన్, మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బు, నేతలు సతే ్యంద్రశేఖర్, బాలచం ద్ర,ఎల్లప్ప, కార్పొరేషన్ డైరెక్టర్ వేణు, రెస్కో డైరెక్టర్ ఆర్ముగం పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

కుప్పం, డిసెంబర్ 22 ప్రభాతవార్త



స్థానిక డా॥ వైసి జేమ్స్ ఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్‌లో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గణిత మేధావి శ్రీ శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూజలుచేవారు. ఇన్‌చార్జ్‌ప్రిన్సిపాల్ మల్లపు రాజు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యకు పునాది గణితం అని భారతీయ శాస్త్రవేత్తలు ప్రపంచానికి దిక్సూచిగానిలిచారన్నారు. గణితాన్ని కష్టంగా కాకుండా ఇష్టపడి చదవాలని గణిత అధ్యాపకుడు ప్రవీణ్‌కుమార్ సూచించారు. కార్యక్రమంలో హెచ్ఒడి డా॥ సయ్యద్ హుసేన్‌మియా, అధ్యాపకులుసుజాత, రాధ, నాగరత్న, మాణిక్యం, డా॥మురళీమోహన్, ఉదయ్‌కుమార్, రాజారెడ్డిపాల్గొన్నారు.

## క్రికెట్ విజేతలుగా పెద్దపంజాణి టీచర్ల జట్టు



**పెద్దపంజాణి, డిసెంబర్ 22 ప్రభాతవార్త** చిత్తూరు మెసానికల్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఉపాధ్యాయుల క్రీడా పోటీల్లో పెద్ద పంజాణి మండలంకు చెందిన ఉపా ధ్యాయుల జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో గుడుపల్లె మండలం జట్టుపై విజయం సాధించింది. దీంతో మండలంలోని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే మహిళల త్రోబాల్ పోటీల్లో పెద్దపం జాణి మండలం జట్టు రన్నర్లుగా, కుప్పం మండల ఉపాధ్యాయులజట్టువిజేతలుగా నిలిచారు.

## అబద్ధపు మాటలు: నకిలీ నాటకాలు



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 22 ప్రభాతవార్త** కసిఆర్ జగన్ ఇద్దరూ ఇద్దరే అని ఇద్దరూ ఫేక్ లీడర్లే అని బిసి విభాగం తెలుగుదేశం పార్టీ సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ధ్వజమెత్తారు. అబద్దపుమాటలతో, నకిలీ నాటకాలతో అమాయకపు తెలంగాణ సమాజాన్ని కెసిఆర్ మోసగించారని ఆంధ్ర ప్రదేశ్ ప్రజలను అభూత కల్పనలతో మోసగించి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దోచుకున్నారని ధ్వజమెత్తారు. మరుగున పడుతున్న తమ రాజకీయ జీవితాలను పునరుజ్జీవింపజేసుకోవటానికి ఇద్దరు నాయకులు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలను మరోసారి మోసం చేయటానికి అరచేతిలో స్వర్గం చూపుతున్నారన్నారు. ఈ మీడియా సమావేశంలో తెలుగుదేశంలోని వివిధ వర్గాలకు చెందిన నాయకులు మిన్నల్‌రవి, డాక్టర్ ఎం ఉమేష్‌రావు, బీమాల భాస్కర్, డివినారాయణ, కోట చంద్రశేఖర్, మణి, గాజుల భరత్, గంగానపల్లి రమేష్, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

## శక్తి పీఠం స్వామిని సత్కరించిన దేశం నాయకులు



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 22 ప్రభాతవార్త** తమిళనాడు లోని శివకాళి శక్తి పీఠంకు చెందిన పీఠాధిపతి శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం రాగా ఆయనను తెలుగుదేశం నాయకులు కలసి సత్కరించారు. కంచిలోని శివకాళి పీఠంకు చెందిన మోహననంద స్వామి రాగా ఆయన్ను తంగేళ్ళ పాళెం సింగిల్‌విండో ఛైర్మెన్ బీమాల భాస్కర్ తెలుగుదేశం పార్టీకి చెందిన చందూ, మహేష్, ఖాదర్‌లు ఆలయ ప్రవేశం వద్ద స్వాగతం పలికారు. స్వామితో పాటు వాయులింగేశ్వరుని దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవార్లను దర్శించుకున్న వారు తరువాత స్వామిని దుశ్శాలువతో సత్కరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ అభివృద్ధి గురించి నియోజకవర్గంలో శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధిని వివరించారు.

## గణిత మేధావి జయంతోత్సవాలు



శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలోని ముచ్చివోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రపంచ గణిత మేధావి శాస్త్ర కోవిదుడు శ్రీనివాసరామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత శాస్త్ర ప్రదర్శనలతో ఆకట్టుకు న్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిరంజీవి మాట్లాడుతూ విద్యార్థులు గణితంలో వారి మేధస్సును వెలికి తీసేలా ప్రదర్శనలు ఏర్పాటు చేయటం అభినందనీయం అని ప్రసంశించారు. గణితశాస్త్ర ఉపాధ్యాయిని నిర్మలకుమారి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో ఉపాధ్యాయుడు డాక్టర్ సుబ్రమణ్యం, శర్మ, నరసింహులు, చంద్ర, నాగరాజు, చంద్రశేఖర్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. 30మంది విద్యార్థులు బహుమతులు అందించారు.

## రెవెన్యూఉద్యోగికి సన్మానం



**తొట్టంబేడు, డిసెంబర్ 22 ప్రభాతవార్త** ఎపిఆర్ఎస్ఏ శ్రీకాళహస్తి డి విజన్ యూనిట్ సమావేశం జరిగి తొట్టంబేడు మండలానికి చెందిన సంయుక్త కార్యదర్శిగా నియామకమైన బి.నారాయణ స్వామిని ఎన్ను కున్నారు. సోమవారం తొట్టంబేడు లో ఆయన్ను సత్కరించారు. తొట్టంబేడు మండల రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పని చేస్తున్న నారాయణ స్వామిని సత్కరించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరిస్తామని

## భువనేశ్వర్‌కు బయలుదేరిన ఐసర్ విద్యార్థులు



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 22 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు సమీపంలో ఏర్పాటు చేసిన ఐసర్ నుంచి 149 మంది విద్యార్థులు భువనేశ్వర్ ఐసర్‌లో జరిగే క్రీడాకోత్సవాలకు బయలు దేరారు. 2025 ఐసర్ స్పోర్ట్స్ మీట్‌ను భువనేశ్వర్‌లోని ఐసర్‌లో ఏర్పాటు చేసారు. అయితే అక్కడ తమ విద్యార్థుల సత్తా చాటటానికి రిజిస్ట్రార్ ఇంద్రప్రీత్ సింగ్ కోహ్లి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ద్దేశించి మాట్లాడుతూ శాస్త్ర పరిశోధనల్లో తమకంటూ ఓ స్థానాన్ని సాధించుకున్న విద్యార్థులు క్రీడల్లో తమ ప్రతిభను చూపి తిరుపతి ఐసర్‌పేరు ప్రతిష్టలను మిక్కిలి ఇనుమడింపజేయాలని సూచించారు. క్రీడాస్ఫూర్తితో పాల్గొని తమ ప్రతిభతో తిరుపతి ఐసర్ ఎందులోనూ తక్కువ కాదనిపించాలని పిలుపునిచ్చారు. డైరెక్టర్ ప్రొఫెసర్ సంతాను భట్టాచార్య మాట్లాడుతూ తాను డైరెక్టర్‌గా ఎన్నోమైలు రాళ్ళను దాటుకుంటూ ఓ అద్భుతమై శాస్త్రవవేత్తల కార్ఖానాగా తీర్చి దిద్దుతున్నామని మొదటి సారి జాతీయ స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనే అవకాశం వచ్చిందన్నారు. విజేతలై రావాలని ఆశీర్వదించారు.

## భక్తిశ్రద్ధలతో అష్టలక్ష్మి మహాయగ్నం



**రామచంద్రాపురం, డిశంబర్ 22 ప్రభాతవార్త:** సి.రామాపురం సమీపంలోని శ్రీబ్రహ్మశ్రీ గురువానంద గురూజీ ఆశ్రమంలో జరుగుతున్న అష్టలక్ష్మి మహాయగ్నాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం అష్టలక్ష్మిలను రామచం ద్రాపురం ఎస్టీ కాలనీ, మిట్టూరు గ్రామాలలో గ్రామో

## 11 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించిన జడ్పీ ఛైర్మన్



**చిత్తూరు, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** జిల్లా పరిషత్ పరిధిలో కారుణ్య నియామకాల కింద 11 మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను సోమవారం జడ్పీ కార్యాలయంలోని జడ్పీ ఛైర్మన్ ఛాంబర్‌లో జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అందజేశారు. అలాగే జడ్పీ పరిధిలో రికార్డు అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న 9 మందిని జూనియర్ అసిస్టెం ట్లుగా పదోన్నతులు కల్పించి జిల్లా పరిషత్ పరిధిలో ఖాళీగా వున్న ప్రదేశాల్లో పోస్టింగ్స్ జారీ చేశారు. ఉద్యోగాలు, పదోన్నతులు పొందిన వారు విధులను పక్కాగా నిర్వర్తించి ప్రజలకు సేవ చేసి జిల్లా పరిషత్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సిఇఒ రవికుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రావుకు డిజిపి డిస్క్ కమెండేషన్ అవార్డు



**చిత్తూరు, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** చిత్తూరు క్రైమ్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఉమామహేశ్వర్ రావుకు డిజిపి బ్రాంజ్ డిస్క్ అవార్డు లభించింది. 2025 సంవత్సరంలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన జిల్లాలోని 12 మంది పోలీసులను డిజిపి డిస్క్ కమెండేషన్ అవార్డులకు ఎంపిక చేశారు. ఈ మేరకు చిత్తూరు ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ పి.గోవిందరాజులు, చిత్తూరు తాలుకా పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ పి.పాల్గుణలకు డిజిపి సిల్వర్ డిస్క్ అవార్డులు లభించాయి. అలాగే చిత్తూరు క్రైమ్ ఇన్స్‌పెక్టర్ ఉమామహేశ్వర్‌రావుతో పాటు చిత్తూరు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ అనిల్‌కుమార్, చిత్తూరు టుటౌన్ హెడ్‌కానిస్టేబుల్ కె.బాపూజీ, జిడినెల్లూరు హెడ్‌కానిస్టేబుల్ బి.ప్రసాద్, నింద్ర కానిస్టేబుల్ వి.హరి, గంగవరం కానిస్టేబుల్ శశిధర్, కాణిపాకం కానిస్టేబుల్ పవన్‌కుమార్, పెద్దపంజాణి కానిస్టేబుల్ ఎల్లప్ప, పలమనేరు అర్బన్ కానిస్టేబుల్ కె.రాజేష్, కానిస్టేబుల్ శివ రాజేంద్రప్రసాద్‌లకు డిజిపి బ్రాంజ్ డిస్క్ కామెండేషన్ అవార్డులు దక్కాయి. డిజిపి డిస్క్ కమెండేషన్ అవార్డులు దక్కిన వారిని ఎస్పీ తుషార్ దూడి ప్రత్యేకంగా అభినందించారు.

## ఖోఖోలో హైస్కూల్ విద్యార్థినిల ప్రతిభ



**బంగారుపాళ్యం, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు విశేష ఆట ప్రతిభను కనబరిచారు. ప్రకాశం జిల్లాలో జరుగుతున్న అంతర్ జిల్లాల ఖోఖో పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు తరపున హైస్కూల్ విద్యార్థినిలు దీప్తి, ఉమేరా, జయశ్రీ, కావ్యలు పాల్గొన్నారు. వీరు జట్టు గెలుపు కోసం విశేష ఆట ప్రతిభను కనబరచి రాష్ట్ర స్థాయిలో జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చారని ఇన్‌ఛార్జీ హెడ్మాస్టర్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర స్థాయి జట్టు తరపున వీరు పాల్గొంటారని ఫిజికల్ డైరెక్టర్ మధుబాబు, గిరిజ, సరస్వతిలు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల తరపున ఉపాధ్యాయులు మెమోంటోలతో సత్కరించారు.

## టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ



**బంగారుపాళ్యం, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** మండలంలోని తుంబపాళ్యం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న టెన్త్ విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ స్టడీ మెటీరియల్‌ను యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం రూపొందించగా గ్రామానికి చెందిన బలరాం యాదవ్ విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. టెన్త్ క్లాస్‌లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఈ స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగకరంగా వుంటుందని హెడ్మాస్టర్ పారిజాతం పేర్కొన్నారు. యుటిఎఫ్ మాజీ అధ్యక్షులు మొగిలయ్య, ఉపాధ్యాయులు హరిప్రియ, గంగాభవాని, బాబు, గిరిధర్, దామోదర్, పూర్ణిమ పాల్గొన్నారు.

## పోలీసు సమస్యల పరిష్కార వేదికకు 50 సమస్యలు

**చిత్తూరుహెల్త్, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ తుషార్ దూడి సోమవారం జిల్లా పాత పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుండి సమస్యలపై 50 అర్జీలు అందాయి. ప్రజల నుండి అందిన అర్జీలను పరిశీలించిన ఎస్పీ తుషార్ దూడి సత్వరం క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అత్యధికంగా భూసమస్యలపై 18 ఫిర్యాదులు అందగా, డబ్బుతగాదాలు6, కుటుంబతగాదాలు6, పోలీసు సేవలు 5, ఆస్తి తగాదాలు 5, వేధింపులు 4, చీటింగ్‌పై 2 ఫిర్యాదులు అందాయి.

## ఉగ్రాణంపల్లిలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు



**పెనుమూరు, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** ప్రజల మంచినీటి సమస్యను పరిష్కరించడానికి మండల పరిధిలోని ఉగ్రాణంపల్లిలో సర్పంచ్ మురళీకుమార్‌రెడ్డి సోమవారం వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులందరు తమ నిధులు ఖర్చు చేసి సొంతంగా మంచినీటి సరఫరా కోసం వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవడం హర్షనీయమన్నారు. కలుషిత నీరు సేవించడం వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం వుండటంతో గ్రామస్తులందరు చర్చించి తమ కోసం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ధనంజయరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, దీరజ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కనకరాజురెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రమణారెడ్డి, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రామనుజం జయంతి



**గుడిపాల, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పానాటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకుని గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మండల విద్యాశాఖ అధికారి గణపతి మాట్లాడుతూ విద్యార్థులకు గణితం ప్రాముఖ్యతను వివరించారు. గణితం కేవలం గుర్తులు కాదని, అవి జీవం వున్న భావాలన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను ఆయన పరిశీలించారు. స్థానిక సర్పంచ్ మధురెడ్డి, చిత్తపార హైస్కూల్ హెడ్మాస్టర్ కిరణ్, గణిత ఉపాధ్యాయుడు జవహర్‌లాల్‌రెడ్డి, పాఠశాల విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులుగా రెడ్డప్పనాయుడు



**చిత్తూరు, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులుగా రెడప్పనాయుడు(పూతలపట్టు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా యుటిఎఫ్ కార్యవర్గ ఎన్నికలు సోమవారం జిల్లా యుటిఎఫ్ కార్యాలయంలో ఏకగ్రీవంగా జరిగాయి. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా రాష్ట్ర యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణలు హాజరయ్యారు. ఈ ఎన్నికల్లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్.మణిగండన్(విజయపురం), గౌరవ అధ్యక్షులుగా కె.సదాశివరెడ్డి(పులిచెర్ల), సహాధ్యక్షులుగా రెహానాబేగం(యాదమరి), డి.ఏకాంబరం(ఐరాల), జిల్లా కార్యదర్శులుగా గాలి సురేష్(కుప్పం), బి.ఈశ్వర మహేంద్ర(పులిచెర్ల), పార్థసారధి(పెనుమూరు), పంటపల్లి సురేష్(యాదమరి), పిసి బాబు(గంగవరం), ఎం.శ్రీనివాసులు(పెద్దపంజాణి), ఎం.శశికుమార్(బైరెడ్డి పల్లి), కె.వంశీకృష్ణ(విజయపురం), బి.రామ్మూర్తి నాయక్(రామకుప్పం)లు ఎన్నికయ్యారు.

## 26న సంవత్సరాది ఏర్పాట్లుపై సమన్వయ కమిటీ సమావేశం

**కాణిపాకం, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో నూతన ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపట్టవలసిన ఏర్పాట్లుపై ఈనెల 26న సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో స్థానిక ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

## తొడతర హైస్కూల్‌లో ఘనంగా గణిత దినోత్సవం



**తవణంపల్లె, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** మండలంలోని తొడతర జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం గణిత దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. జిల్లా పీఆర్‌టియు ప్రధాన కార్యదర్శి పాఠశాల గణిత ఉపాధ్యాయులు ఎ.విజయ భాస్కర్‌రెడ్డి ఆధ్వర ్యంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నిత్య జీవితంలో గణితం యొక్క ఆవశ్యకత గురించి చక్కగా వివరించారు. అలాగే పాఠశాల విద్యార్థులు తాము తయారు చేసిన భోదన, అభ్యసన సామాగ్రిని ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం లవన్‌కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు వెంకట రమణ, శ్రీనివాసులు, సిద్దక్, భార్గవిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## పలువురు ప్రముఖులను కలసిన సునీల్‌కుమార్ చౌదరి



**తవణంపల్లె, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** జిల్లా టీడీపీ ప్రధాన కార ్యదర్శిగా నియమితులైన వై సునీల్‌కుమార్ చౌదరి జిల్లాలోని పలువురు టీడీపీ ప్రముఖులను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, మాజీ ఎంపీ అమరరాజా కంపెనీల అధినేత గల్లా జయదేవ్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, పలమనేరు, నగరి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఎన్.అమరనాథరెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, పులివర్తి నాని తదితరులను సునీల్‌కుమార్ చౌదరి మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీస్సులందుకున్నారు. అలాగే తనకు భవిష్యత్తులో తమవంతు సహాయ సహకారాలు అందించాలని వారిని కోరారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు కంప్యూటర్ శివ, శరవణ కుమార్, ప్రకాష్‌నాయుడు, సురేష్‌నాయుడు, మాధవరం రవిలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అబ్బురపరచిన గ్రామీణప్రాంత విద్యార్థుల అష్టావధానం



**చిత్తూరురూరల్, డిసెంబరు 22 ప్రభాతవార్త:** జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని తుమ్మింద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పాఠశాల హెచ్ఎం సుజాత అధ్యక్షతన గణిత అవధాని అరుణశివప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు శర్వణ్, చాముండిలచే నిర్వహించిన అష్టావధానం అందరినీ అబ్బురపరచింది. 8వ తరగతి చదువుతున్న శర్వణ్, 7వ తరగతి చదువుతున్న పి చాముండిలు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పది అంకెల సంఖ్యను చెప్పగా ఒక్కసారివిని మొదటినుంచి చివరికి చివరి నుంచి మొదటికి చెప్పడమే కాకుండా ఇంతపెద్దసంఖ్యను పది 9లతో గుణించి 20అంకెల లబ్దాన్ని ఏ క్రమంలో అడిగిన చెప్పి అందరినీ అబ్బురపరచారు. అలాగే విశ్రాంత ఉపాధ్యాయులు అమర్నాథరెడ్డి, చిన్నతంబిలు అడిగిన వర్గాలు, ఘనాలు, వర్గమూలాలను సైతం అవలీలగా క్యాలిక్యులేటర్ కంటే వేగంగా సమాధానం చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు మొగిలయ్య, సంపంగి, సురేంద్ర, కృష్ణప్రసాద్, పాపుదేశి ఫౌండేషన్ సభ్యురాలు మౌనిక, లైన్స్‌క్లబ్ చిత్తూరు గోల్డ్‌సభ్యులు శ్రీనివాసమూర్తి, హరిక్రిష్టారెడ్డి, ఎస్ఎంసి ఛైర్మెన్ కృష్ణమూర్తి, గణిత ఉపాధ్యాయులు సంజీవి, అమర్నాథ్, కాళప్ప, లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

## నేడు శ్రీవారి కల్యాణోత్సవం



**పుంగనూరు డిసెంబర్ 22 ప్రభాతవార్త:** శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామి వారి కల్యాణోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ ఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ, శ్రవణ నక్షత్రం పురస్కరిం చుకుని ప్రతి సంవత్సరం నిర్వహించే సంప్రదాయబద్ధమైన కల్యాణోత్సవాన్ని ఈ ఏడాది కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటల వరకు స్వామివారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులవ్వాలని ఆయన కోరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనాలు, పూజా కార్యక్రమాలు సజావుగా జరిగేలా ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.

## గణిత విశ్వ విజేత రామానుజన్



***పుంగనూరు రూరల్ డిసెంబర్ 22 ప్రభాతవార్త:*** గణిత విశ్వ విజేతగా రామానుజన్ భారతదేశ కీర్తిని దిగంతా లకు వ్యాపింప చేశారని ప్రిన్సిపాల్ రాధా కృష్ణ అన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం శ్రీనివాస రామానుజన్ జయంతిని నిర్వహించారు. కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ రాధాకృష్ణ మాట్లాడుతూ, గణిత రంగంలో ఆయన చమ చేసిన సేవలు చిరస్మరణీయమరున్నారు. గణిత శాస్త్ర అధ్యాపకులు శివయ్య మాట్లాడుతూ, గణితంలో రామానుజన్ సాధించిన విజయాలు అనితరసాధ్యమైనవని పేర్కొన్నారు. ఆయన పేరు మీదుగా ప్రతి సంవత్సరం సహస్ర అవార్డ్స్ మరియు ఐసిటిపి అవార్డులు ఇస్తామన్నారు. రామానుజన్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వ్యాసరచనమరియువక్తృత్వపోటీలునిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పీవీ రావుకు ఘన నివాళులు



**పుంగనూరు డిసెంబర్ 22 ప్రభాతవార్త:** పట్టణంలోని మాల మహానాడు కార్యాలయంలో మాల మహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు 20వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సంఘ నాయకులు, సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భం గా మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ ఆర్ అశోక్ మాట్లాడుతూ, వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాలలను ఒక్క తాటిపైకి తీసుకువచ్చిన మహానుభావుడు పీవీ రావు అని కొనియాడారు. మాలల హక్కుల సాధన కోసం ఎన్నో ఉద్యమాలు చేపట్టి దళిత సమాజానికి దిశానిర్దేశం చేసిన నాయకుడు అని గుర్తు చేశారు. పీవీ రావు మరణించి 20 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఆయన చేసిన సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మానవ జీవితం గణితంతో ముడిపడింది



**చౌడేపల్లి, డిసెంబర్ 22 ప్రభాతవార్త** మానవ జీవితం గణితంతో ముడిపడిందని పలువురు వక్తలన్నారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురష్కరించుకొని మండల వ్యాప్తంగా గల పాఠశాలల్లో గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని జరుపుకొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులు లెక్కల నామూనాలను తయారు చేసారు. క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రోత్సాహక బహుమతులందించారు. అనంతరం రామానుజన్ జీవిత చరిత్ర, ఆయన గణితశాస్త్రానికి చేసిన సేవలను వివరించారు. ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రెవిన్యూ అధికారుల చెస్‌పోటీలో విజేతగా మురళీకృష్ణ



**చౌడేపల్లి, డిసెంబర్ 22 ప్రభాతవార్త** జిల్లాస్థాయిలో రెవిన్యూ అధికారుకుల నిర్వహించిన చెస్ పోటీల్లో చౌడేపల్లి సర్వేయర్ మురళీకృష్ణ విజేతగా నిలచాడు. జిల్లా కేంద్రం చిత్తూరులోని కలెక్టరేట్‌లో రెవిన్యూ అధికారులకు వివిధ క్రీడలు నిర్వహించారు. అందులో భాగంగా చెస్ విభాగంలో 60మంది అధికారులు తలబడ్డారు. వీరిలో మురళీకృష్ణ విజయం సాధించాడు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో డిఆర్ఓ మోహన్‌కుమార్‌ఆయనకు మెమొంటోనందించి సత్కా రించారు. ఎంతో కష్టతరమైన చెస్ పోటీలో విజయం సాధించిన ఆయన్ను తహశీల్దార్ పార్వతి, అధికారులు అభినందించారు.

## ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు



**చిత్తూరురూరల్, డిసెంబరు 22 ప్రభాతవార్త:** చిత్తూరుపట్టణం, సుందరరాజపురంలోని విజయం పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ 139వ జయంతి వేడుకలను విజయం విద్యాసంస్థల అధినేత డా.తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ డా.శైలజ తేజోమూర్తి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ జీవిత ప్రస్థానం, ఆయన గణితశాస్త్రంలో వెలువరించిన గణిత, సంఖ్యాశాస్త్రం తదితర విషయాలను విద్యార్థులకు విపులంగా వివరిస్తూ, విద్యార్థులందరూ గణితశాస్త్రవేత్తలను స్ఫూర్తిగా తీసుకొని చేసిన సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కాగా పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులు గణిత శాస్త్రవేత్తల గురించి, గణితశాస్త్రానికి సంబంధించిన కీలకమైన అంశాలను ప్రాజెక్టురూపంలో ప్రదర్శించి అందరినీ ఆకట్టుకొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు, ప్రధానోపాధ్యాయురాలఉ డా. శ్రీదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ గణితదినోత్సవం



**చిత్తూరురూరల్, డిసెంబరు 22 ప్రభాతవార్త:** చిత్తూరునగరం, సంతపేటలోని బృందావన్ ఇంగ్లీషు మీడియం పాఠశాల నందు సోమవారం గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రిన్సిపాల్ శైలజ, డైరెక్టర్ ప్రియతేజలు జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీనివాస రామానుజ అయ్యంగారి జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులు గణితముకు సంబంధించి అనేక నాటికలు, నృత్యాలు, పాటల రూపంలో అద్భుతంగా ప్రదర్శించారు. అలాగే ఉపాధ్యాయులు పిల్లల జ్ఞానాన్ని పరీక్షించడానికి ప్రశ్నోత్తరాల కార్యక్రమం నిర్వహించగా విద్యార్థిని, విద్యార్థులు చురుగ్గా పాల్గొని అవలీలగా సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గణిత ఉపాధ్యాయులు, ఇతర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించండి.. ప్రాణాలను కాపాడుకోండి




**పూతలపట్టు, డిసెంబర్ 22, ప్రభాతవార్త** చిత్తూరు జిల్లా సూపరిడెంట్ ఆఫ్ పోలీస్ తు షార్ దూడి ఐపిఎస్ ఉత్తర్వుల మేరకు చిత్తూరు సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ సాయినాథ్ పర్యవేక్షణలో హెల్మెట్ అవేర్నెస్‌లో భాగంగా పూతలపట్టు మండలం ఎస్‌వి సెట్ ఇంజినీరింగ్ కాలేజ్ దగ్గర చిత్తూరు తిరుపతి జాతీయ రహదారిపై మోటార్ సైకిల్ నడిపే వాహన చోదకులను నిలిపి హెల్మెట్ లేని వారిని హెల్మెట్ ధరించాలని ప్రాణాలను కాపాడుకోవాలని తమ ప్రాణం మీ కుటుంబం పై ఆధారపడి ఉందని తద్వారా రోడ్డు ప్రమాదాలు జరగడం తగ్గుతుందని వాహన చోదకులకు అవగాహన కల్పించడంతో పాటు హెల్మెట్ ధరించకపోవడం వల్ల కలిగే అనర్థాలను ఒక ఫ్లెక్సీ రూపంలో వాహనదారులకు ప్రజలకు పోలీస్ సిబ్బంది అవగాహన కల్పించడం కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ గోపి, పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల ప్రాణాలు రక్షించడమే పోలీసుల లక్ష్యం : ఎస్పీ



వెంకటగిరి, డిసెంబర్ 22, ప్రభాతవార్త
పోలీస్ ఉద్యోగం అన్నది మహోన్నతమైనదని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. వెంకటగిరి మండలం వల్లివేడు వద్ద ఉన్న తొమ్మిదవ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో కొత్తగా ఎంపికైన కానిస్టేబుల్‌లకు 9 నెలలు నిర్వహించే శిక్షణను ఎస్పీ, కమాండెంట్ సాయి ప్రసాదులు ప్రారంభించారు. వెయ్యి మందిలో కూడా ఒక కానిస్టేబులు యూనిఫాంలో ఉంటే గుర్తింపు ఉంటుందని తెలిపారు. శాంతిభద్రతలు పరిరక్షించడంలో పోలీసులు కీలకపాత్ర అని తెలిపారు. శాంతిభద్రతలు బాగుంటే పరిశ్రమలు వస్తాయని పరిసర ప్రాంతాల అభివృద్ధి చెందాయని తెలిపారు. ఇతర ఉద్యోగాలతో పోల్చు టకుంటే పోలీసు ఉద్యోగాలు కష్టతరమైనవని అయినా సంతోషకరంగా ఉంటుందని తెలిపారు. శాంతిభద్రతలు పర్యటించడంలో పోలీసుల అదే కీలక పాత్ర అని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో అన్ని నేర్పిస్తారని తెలిపారు. కమాండెంట్ సాయి ప్రసాద్ మాట్లాడితే పోలీసులకు క్రమశిక్షణ అవసరమని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలను కూడా ప్రాణంగా పెట్టాలని చెప్పారు. ప్రజల ప్రాణాల కాపాడటమే పోలీసుల లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ల టి రామకృష్ణ, ఆనంద కన్నా, సిఐ ఏవి రమణ, ఎస్సై ఏడుకొండలు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలి
### - సంతకాల సేకరణ పత్రాలు కలెక్టర్‌కు అందజేత



కోట, డిసెంబర్ 22 ప్రభాతవార్త
గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని కోట మండల జెఎసి కన్వీనర్ జనార్ధనం, జెమ్మి ప్రసాద్, మీజూరు మాధవ్, మీజూరు మల్లికార్జునలు తిరుపతిలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తిరుపతి జిల్లాలో గూడూరు నియోజకవర్గం కలవడం వలన గత మూడేళ్లగా ఈ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్‌కు వివరించారు. ఇటీవల కాలంలో అన్ని వర్గాల ప్రజల నుంచి సేకరించిన సంతకాల పత్రాలను కలెక్టర్‌కు అందజేశారు.

## నెల్లిపూడి టిడిపి ఇన్చార్జ్‌గా హరీష్ నాయుడు



వాకాడు, డిసెంబర్ 22, ప్రభాతవార్త
వాకాడు మండలం నెల్లిపూడి పంచాయతీ టిడిపి ఇన్చార్జిగా కల్లూరు హరీష్ బాబు నాయుడును గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ నియమించారు. సార్వత్రిక ఎన్నికల ముందు టిడిపిలోకి ప్రవేశించిన నాయుడు ఆ ఎన్నికలలో క్రియాశీలకంగా వ్యవహరించారు. మండల పరిధిలోని అందరు నాయకులతో సత్సంబంధాలుతో నెల్లిపూడి పంచాయతీ ప్రజలతో తన పూర్వీకులతో ఉన్న అనుబంధాన్ని మరోసారి మెరుగుపరుచుకుంటూ, మండల టిడిపి నాయకులలో క్రియాశీలకమైన నాయకుడుగా ఎదుగుతున్న హరీష్ బాబు నాయుడు సేవలను గుర్తించిన టిడిపి అధిష్టానం ఆయనకు ఆ పంచాయతీ బాధ్యతలను అప్పగించినట్లుగా తెలుస్తున్నది. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ పంచాయతీ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, టిడిపి పార్టీని బలోపితం చేయడమే తన సంకల్పం. స్థానిక సంస్థ ఎన్నికల్లో టిడిపి విజయకేతనం తమ లక్ష్యమన్నారు.

## మన్నారుపోలూరు హైస్కూల్లో రామానుజన్ జయంతి



సూళ్లూరుపేట, డిసెంబర్ 22 ప్రభాతవార్త
సూళ్లూరుపేటలోని మన్నారుపోలూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గణితానికి సంబంధించి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం పొందిన మహాలక్ష్మికి రూ.3,116, ద్వితీయ స్థానం పొందిన డి.మునికుమార్‌కు రూ.2,116, తృతీయ స్థానం పొందిన యువశంకర్‌కి రూ.1,116 పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రాజశేఖర్ చేతులు మీదుగా అందజేశారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ పెన్నులు, ప్యాడ్లు అందజేశారు. గణిత ఉపాధ్యాయులు దామోదరం, పవన్‌కుమార్‌లు ఈ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై తాసిల్దార్‌కు ఫిర్యాదు

వెంకటగిరి, డిసెంబర్ 22, ప్రభాతవార్త : పట్టణంలోని భ్రమరాంబ సినిమా థియేటర్ పక్కన ఉన్న పది సెంట్లు భూమికి సర్వే చేసే హద్దులు ఏర్పాటు చేయాలని వైసిపి నియోజకవర్గ ఆర్టిఐ విభాగం అధ్యక్షులు, కౌన్సిలర్ ఆరి శంకరయ్య తాసిల్దార్ నరసింహులకు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 230/4 లో 10 సెంట్ల ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. ఈ భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. కాగా రాణిపేట లో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బోర్డు కూడా ఏర్పాటు చేయలేదని తెలిపారు. ఆస్పత్రిలో ఉన్నట్లు పట్టణ ప్రజలకు తెలియదని ఇక్కడకు ఎవరు రోగులు రావడం లేదని చెప్పారు. డాక్టర్ను కలిసి బోర్డు ఏర్పాటు చేయాలని తెలిపారు.

## కళాశాలకు క్రీడా సామాగ్రి పంపిణీ

వెంకటగిరి, డిసెంబర్ 22, ప్రభాతవార్త :విశ్రాంత ఉపాధ్యాయులు పునుగోటి సుబ్రహ్మణ్యం ప్రభుత్వ జూనియర్ ప్రిన్సిపల్ రవి కుమార్ కి 15000 రూపాయల విలువగల క్రీడా సామాగ్రిని అందచేశారు. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి పెంపొడించుకోవాలనే లక్ష్యంతో పేద విద్యార్థులు చదువుతున్న ఈ కళాశాలకు వీటిని అందచేస్తున్నానని విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె రవీంద్ర బాబు, శేషు మరియు సీనియర్ సహాయకులు పి గోపీ తదితరులుపాల్గొన్నారు. సుబ్రహ్మణ్యం దాతృత్వానికి ప్రిన్సిపల్, కళాశాల సిబ్బంది ధన్యవాదాలు తెలియచేసారు.

## జాతీయ టెన్నిస్ కోర్టు ప్రారంభం



చిల్లకూరు, డిసెంబర్ 22, ప్రభాతవార్త: ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ అద్వర్యంలో గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టరూ పాశం సునీల్ కుమార్ సోమవారం మహిళా ఆల్ ఇండియా టెన్నిస్ కోర్ట్ ప్రారంభం ఇది చిల్లకూరు మండలంలోని భూధనం గ్రామ సమీపంలో ఉన్నది. జాతీయ స్థాయిలో మహిళా క్రీడాకారిణిలకు టెన్నీస్ పోటీలు మొదలయ్యాయి. హోటల్ అధినేత బద్రి గిరి, సుప్రభ, దాతలు డాక్టర్లు జనార్దన్ రెడ్డి, రోహిణి, కనుమూరు హరిచంద్రా రెడ్డి, వైకాపా సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, టిడిపి నాయకులు అబ్దుల్ రహీమ్, బిల్లు వెంచురామయ్య, గుండాల లీలావతి, చిరంజీవి, ప్రవీణ్ రెడ్డి, కీరవాణి, కోదండ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలి
### - బిజెపి ఆందోళన



కోట, డిసెంబర్ 22 ప్రభాతవార్త: గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలంటూ రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట బిజెపి నాయకులు ఆందోళనకు దిగారు. గత వైసీపీ ప్రభుత్వం అశాస్త్రీయంగా గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలిపారని చెప్పారు. దీంతో నియోజకవర్గంలోని కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల ప్రజలు 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుపతికి ప్రయాణించాల్సి వస్తుందన్నారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలే గాని ప్రజలకు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు తీసుకోకూడదని అన్నారు. అంతకుముందు తహశీల్దార్ జయజయరావుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా కోర్ కమిటీ సభ్యులు దువ్వూరు గిరిధర్‌రెడ్డి, కోటారెడ్డి, అంబరీష్, సారంగం రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## వాకాడు పోలీస్ స్టేషను పరిశీలించిన డి.ఎస్.పి



వాకాడు, డిసెంబర్ 22, ప్రభాతవార్త: మండల కేంద్రంలో ఉన్న వాకాడు పోలీస్ స్టేషన్ ను గూడూరు డిఎస్పి గీత కుమారి ఆకస్మికంగా సోమవారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని పలు రికార్డులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. మండలంలోని క్రైమ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్ఐకి సూచించారు, పండగలు వస్తున్నాయని కోడిపందాలు, పేకాట స్థావరాలు పై నిఘా ఉంచాలని సూచించారు. రాత్రి వేళలో అన్ని కూడలిలో పెట్రోలింగ్ ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు, పోలీస్ స్టేషన్ ఆవరణంలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆమె వెంట వాకాడు ఎస్సై నిఖిల్ బాబు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పెరాల్సిస్ వ్యాధిగ్రస్తుని విచారించిన అధికారులు

వాకాడు, డిసెంబర్ 22, ప్రభాతవార్త పెరాల్సిస్ వ్యాధితో బాధపడుతున్న షేక్ బాబు సోమవారం గ్రీవెన్స్ లో కుటుంబ సభ్యుల సహకారంతో ఎంపీడీవో సాయిప్రసాద్, తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్‌కు పెన్షన్ కొరకు దరఖాస్తు చేశారు. దరఖాస్తు మేరకు వాకాడులో మల్లెపూల సెంటర్ కాలనీలో నివసిస్తున్న షేక్ బాబు కథ కొంతకాలంగా పక్షవాతం వ్యాధితో బాధపడుతున్నారని కుటుంబ సభ్యులు దరఖాస్తు మేరకు ఎంపీడీవో సాయిప్రసాద్, తహసిల్దార్ సయ్యుత్ ఇక్బాల్‌లు కలిసి విచారించి పరిశీలించారు. పెరాల్సిస్తో బాధపడుతున్న బాబుకు స్లాట్ అధికారులు బుక్ చేశారు. మెడికల్ సర్టిఫికెట్ వచ్చిన వెంటనే పెన్షన్ మంజూరు కొరకు ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు.

## ఘనంగా జాతీయ గణిత దినోత్సవం వేడుకలు



చిల్లకూరు, డిసెంబర్ 22, ప్రభాతవార్త: మండలంలోని పిసివి పాలెం ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఘనంగా గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు గణిత ప్రాజెక్టులను ఆసక్తికరంగా తయారుచేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల సందర్శించిన డిప్యూటీ డిఇఒ సనత్ కుమార్ మాట్లాడుతూ గణితం పట్ల ఆసక్తి కలిగించే ఇటువంటి ప్రదర్శన ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. పదో తరగతి విద్యార్థులకు వందరోజుల హరిప్రేమపై తగిన సూచనలు సలహాలు తెలియజేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు వందరోజుల కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు పి. అనసూయ, ఎస్ చంద్రశేఖర్, శ్రీనివాసులు, మధు, ప్రజ్ఞేంద్ర రెడ్డి, లీల, నాగభూషణమ్మ, విద్యుల్లత, లావణ్య, రవీంద్ర, కామేశ్వరి, డివి రమణయ్య, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ పెట్టుకో జీవితాన్ని సురక్షితంగా ఉంచుకో : డిఎస్పీ



గూడూరు, డిసెంబర్ 22, ప్రభాతవార్త
ద్విచక్ర వాహనాల నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆ ప్రమాదవ అకస్మాత్తుగా జరిగే రోడ్డు ప్రమాదాలలో హెల్మెట్ ఉండడం వల్ల ప్రాణాలను నిలుపుకోవచ్చని గూడూరు డిఎస్పీ గీతా కుమారి వెల్లడించారు. పట్టణంలోని హాస్పిటల్ రోడ్‌లో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద హెల్మెట్ దుకాణాన్ని డిఎస్పి గీతా కుమారి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలి

కోట, డిసెంబర్ 22 ప్రభాతవార్త
రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని కోట మండల తహశీల్దార్ కె.జయజయరావు కోరారు. సోమవారం స్థానిక ఐకెపి కార్యాలయంలో జిల్లా డిపిఎం ఆదేశాల మేరకు సంఘమిత్ర కార్యవర్గ సభ్యులు, వ్యవసాయ శాఖ అధికారులతో సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ జయజయరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రసాయన మందులు వాడిన ఆహారం తినడం వలన అనారోగ్యం పాలవుతారని చెప్పారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. మండలంలోని 50 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తామని ఎపిఎం అనిల చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ దిలీప్‌కుమార్, సిడిపిఓ మునికుమారి, ఎఫ్ఎంటిలు శ్రీనివాసులు, పద్మమ్మ, రాంబాబు, శివకుమారి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస రామానుజన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

కోట, డిసెంబర్ 22 ప్రభాతవార్త
గణితం అంటే భయపడే విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేలా సులభ పద్ధతిలో బోధనలు చేయాలని ఎంఇఓ దారా మస్తానయ్య అన్నారు. సోమవారం కోట జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. గణితం సబ్జెక్టును ఇష్టపడి నేర్చుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అంతకుముందు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, ఎంఇఓ పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

## సర్వసభ్య సమావేశానికి పలు శాఖలు డుమ్మా



తడ, డిసెంబర్ 22 ప్రభాతవార్త
ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేసేందుకు మండల స్థాయిలో జరిగే సర్వసభ్య సమావేశం ఎంతో ప్రాధాన్యత కలిగింది ఈ కార్యక్రమానికి ప్రధాన శాఖలు గైర్హాజరు కావడంతో ప్రజా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు ఇప్పటికే సర్పంచులు ఎంపీటీసీలు పదవి కాలం చివరి దశలో ఉండడంతో తమకు రావలసిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల బిల్లుల గురించి చర్చించవలసిన సమయంలో అధికారులు గైర్హాజరు కాకపోవడంతో ప్రజా ప్రతినిధులు గళమెత్తారు అదేవిధంగా సర్పంచుల పదవీకాలం చివరి దశలో ఉండడంతో గ్రామాలలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలు గురించి ప్రభుత్వ అధికారులు తమకు కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా తమ అనుమతులు తీసుకోకుండా జరపడం సర్పంచులను అగౌరపరచడం సరికాదని సభ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమం ఎంపీడీవో శేఖర్ నాయక్, ఎంపీపీ రఘు, వైస్ ఎంపీపీ కుప్పంపాటి వెంకటేష్, జడ్పిటిసి ఇందుమతి అధ్యక్షతన సాగింది ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై మహిళలకు శిక్షణ

తడ, డిసెంబర్ 22 ప్రభాతవార్త
ప్రకృతి వ్యవసాయ శాఖ వెలుగు మండల సమైక్య సమన్వయంతోనే ప్రకృతి వ్యవసాయం ముందుకు సాగుతుందని ఏపిఎం రాజారెడ్డి, పేర్కొన్నారు మహిళా సమైక్య సభ్యులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఆహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని తెలియజేశారు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సబీనా, సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయంలో అనుసరించవలసిన పద్ధతులు రాజీలేని సూత్రాల గురించి మహిళ సమైక్య సభ్యులకు వివరించారు ప్రతి మహిళా సభ్యురాలు తమ పొలంలో కూరగాయలు ఆకుకూరలు వరి ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసుకోవాలని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని సూచనలు సలహాలు అందజేశారు.

## జార్లపాడు పంచాయతీ ఏర్పాటుతో గ్రామసభ




బాలాయపల్లి, డిసెంబర్ 22, ప్రభాతవార్త
మండలం పిగిలాం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ కాలగంద. లక్ష్మి అధ్యక్షతన గ్రామసభ జరిగింది. పంచాయతీ కార్యదర్శి ఏ.అశోక్ ఆధ్వర్యంలో స్పెషల్ ఆఫీసర్ డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ సమక్షంలో గ్రామసభ నిర్వహించారు. పిగిలాం గ్రామపంచాయతీ నుండి జార్లపాడు, పిగిలాం కొత్తపాలెం, కొమ్మలగుంట గ్రామాలను విభజించి నూతనంగా ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయుటకు పంచాయితీ ప్రజల అభిప్రాయాల కోసం గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు మొత్తం 102 మంది హాజరయ్యారు. గ్రామసభ తీర్మానం ప్రకారం జార్లపాడు, పిగిలాం కొత్తపాలెం, కొమ్మలగుంట గ్రామాలను విభజించు ప్రతిపాదనకు హాజరైన 102 మంది ఆమోదం తెలుపుతూ చేతులెత్తే ప్రాతిపదికన తమ అభిప్రాయం తెలియజేశారు. ప్రతిపాదన ఉన్నతాధికారులకు పంపిస్తామని డిప్యూటీ ఎంపీడీవో తెలిపారు.

---

## యువజనోత్సవాల్లో చిత్తూరు జిల్లాకు అగ్ర స్థానం
### - విజేతలను అభినందించిన కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు, డిసెంబర్ 22 ప్రభాతవార్త:
జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన యువజనోత్సవాల్లో చిత్తూరు జిల్లాకు చెందిన పవన్‌గ్రూప్ (జానపద నృత్యం) ప్రథమ స్థానం దక్కించుకుంది. రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన పవన్ గ్రూప్ సభ్యులను సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అభినందించారు. యువజన శాఖ జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పవన్‌గ్రూప్(జానపద నృత్యం) అగ్రస్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి యువజనో త్సవాల్లో పాల్గొంది. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో చిత్తూరు జిల్లా పవన్‌గ్రూప్(జానపద నృత్యం) రాష్ట్ర స్థాయి అగ్రస్థానంలో నిలవడంతో జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనడానికి అర్హత సాధించింది. శ్రీ వివేకానంద స్వామి జయంతి సందర్భంగా దేశ రాజధాని న్యూఢిల్లీలో 12 జనవరి 2026లో జరిగే జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొననుంది.

## ఎన్నికల హామీలను నెరవేరుస్తున్న కూటమి ప్రభుత్వం - ఎమ్మెల్యే



విజయపురం, డిసెంబరు 22 ప్రభాతవార్త:
గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దశల వారిగా అమలు చేస్తుందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ లక్ష్మిపతిరాజు అధ్యక్షతన జరిగిన అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి చేరవేయాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులకు అందించి తక్షణం పరిష్కారం చూపాలని ఆదేశించారు. అనంతరం నూతనంగా ఎంపికైన ఎంపీపీ లక్ష్మిపతిరాజును శాలువతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో రాజేంద్రన్, వ్యవసాయ అధికారిణి రజని కుమారి, ఎంఈవో వరప్రసాద్‌వర్మ, పీఆర్ఏఈ వీరభద్రం, ఇరిగేషన్ ఏఈఈ ప్రశాంత్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ గిరీష్ కుమార్, హౌసింగ్ ఏఈ ఏళుమలై, నగరి ఏఎంసీ చైర్మన్ డి.రాజమ్మ, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబు, రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి చుక్క ధనంజయయాదవ్, బాలసుబ్రహ్మణ్యం రాజు, వేణుగోపాల్ నాయుడు, ముని భాస్కర్‌రాజు, దశరథరాజు, గజేంద్ర నాయుడు, నాగభూషణం యాదవ్, బాబు నాయుడు, గుణ భూషణమ్మ, సుధాకర్‌రాజు, శరవణ నాయుడు, దాము, పిల్, రవిచంద్రరెడ్డి, నారాయణరాజు, అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

## స్థిరమైన సెరికల్చర్ కోసం సాంకేతిక పరిజ్ఞానం బదిలీ"జాతీయ వర్క్‌షాప్

తిరుపతి యూనివర్సిటీ, డిసెంబర్ 22 ప్రభాతవార్త
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతిబయోసైన్సెస్ అండ్ సెరికల్చర్ విభాగంశ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం), తిరుపతి లోని బయోసైన్సెస్ అండ్ సెరికల్చర్ విభాగం ఆధ్వర్యంలో డిసెంబర్ 2025లో 22వ తేదీ నుండి 23వ తేదీ వరకు "స్థిరమైన సెరికల్చర్ కోసం సాంకేతిక పరిజ్ఞానం బదిలీ" అనే అంశంపై రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. రైతులు, విద్యార్థులు మరియు ఇతర వాటాదారుల్లో అవగాహన పెంపు చేయడం, ఆధునిక మరియు పర్యావరణ అనుకూల సాంకేతికతలను విస్తృతంగా వ్యాప్తి చేయడం ఈ వర్క్‌షాప్ ముఖ్య ఉద్దేశ్యం.వర్క్‌షాప్ కార్యదర్శి మరియు విభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్. విజయకుమారి వర్క్‌షాప్ లక్ష్యాలను వివరించారు. ముఖ్య అతిథి డాక్టర్ కె. శ్రీనివాసులు, ఐఎఎస్, హార్టికల్చర్ అండ్ సెరికల్చర్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పరిశోధన, బోధన మరియు వ్యవసాయ రంగాల మధ్య జ్ఞాన అంతరాలను తగ్గించాల్సిన అవసరాన్ని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో సుమారు 200 మంది సెరికల్చర్ రైతులు, వాటాదారులు, అధికారులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తొట్టంబేడు,డిసెంబర్ 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డులో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో జంగం వెంకటరమణ మృతి చెందారు. తిరుపతిలో వృత్తి రీత్యా జీవనం గడుపుతున్న వెంకటరమణ స్వగ్రామం తొట్టంబేడు మండలంలోని పిల్లమేడు. సాధారణంగా వెంకటరమణ సోమవారం ఉదయం తమ స్వగ్రామానికి వెళ్లెందుకు తన ద్విచక్రవాహనంపై బయలు దేరారు. మృతుని సొదరుడు తులసీ రామ్ రెండవ టౌన్ సిఐ నాగార్జున్‌రెడ్డికి ఇచ్చిన ఫిర్యాదులో తన సొదరుడు వెంకటరమణ(55) తిరుపతి లోని డిఆర్ మహల్ ప్రాంతంలో ఓ దుకాణంలో టీ మాస్టర్‌గా పని చేస్తున్నారు. సోమవారం ఉదయం తన ద్విచక్రవాహనంపై తన స్వగ్రామమైన పిల్లమేడుకు బయలు దేరాడు.శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు వద్దకు వచ్చినపుడు తిరుపతి నుంచి నాయుడుపేట వైపు వెళుతున్న కారు ఢీకొన్నట్లు పిర్యాదులో పేర్కొన్నారు. కారును డ్రైవర్ వేగంగా నడుపుతూ నిర్లక్ష్యంగా నడిపి వెంకటరమణ నడుపుతున్న ద్విచక్రవాహాన్ని వెనుక నుంచి ఢీకొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో తలకు గాయమైన అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన వెంటనే శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఓట్ చోరీపై కూటమి ప్రభుత్వం మాట్లాడడం హాస్యాస్పదంగా ఉంది




తిరుపతి హెల్త్, డిసెంబర్ 22, ప్రభాతవార్త
ఓట్ చోరీపై తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టిడిపి, బిజెపి, జనసేన పార్టీల నాయకులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని పిసిసి డెలిగేట్, మరియు తిరుపతి సిటీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు యార్లపల్లి గోపి గౌడ్ అన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో పిసిసి డెలిగేట్ గోపి గౌడ్, తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ మాజీ అధ్యక్షులు రవి తెలిపారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రజాస్వామ్యాన్ని, న్యాయ వ్యవస్థను, భారత ఎన్నికల కమిషన్ ను సర్వ నాశనం చేశారని విమర్శించారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరగాలని, పారదర్శకత ఉండాలని, ప్రతి ఓటరు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలనే దృఢ సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిందన్నారు. కానీ 2014లో అధికారంలోకి వచ్చిన బిజెపి వ్యవస్థలను మేనేజ్ చేసి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందన్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టిడిపి, బిజెపి, జనసేన నాయకులకు నెహ్రూని, ఇందిరా గాంధీని, రాహుల్ గాంధీని విమర్శించే అర్హత లేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రవి, వెంకటేష్ గౌడ్, నాగరాజు యాదవ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో ఇస్రో చైర్మెన్



శ్రీకాళహస్తి,డిసెంబర్ 22 ప్రభాతవార్త
శ్రీహరికోట నుంచి ప్రయోగించనున్న సాటిలైట్ ఎల్‌విఎం6-ఎం 6/బ్లూబర్డ్ లాంచింగ్ విజయవంతం కావాలని కోరుతూ శివయ్యకు ప్రీతిపాత్రమైన సోమవారం ఉదయం చైర్మెన్ డాక్టర్ వి నారాయణ సిబ్బందితో కలసి పూజలు జరుపుకున్నారు.ప్రతి శాటిలైట్ ప్రయోగం సందర్భంగా ఇస్రో చైర్మెన్ శివయ్య సన్నిధిలో పూజలు జరిపించుకోవటం విజయం సాధించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో సోమవారం అంతరిక్ష కేంద్రం చైర్మెన్ నారాయణ వారి సిబ్బంది రాగా ప్రోటోకాల్ ఎఇఓ మోహన్,ఎపిఆర్ఓ రవిలు దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్నారు. భక్తితో బుధవారం నిర్వహించనున్న అంతరిక్ష ప్రయోగం విజయవంతం కావాలని పూజలు జరిపించారు. ఏర్పాట్లను ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ ఇన్స్‌పెక్టర్ వెంకటస్వామి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు.

## గూడూరు గిద్దలూరు రోడ్డును మరమ్మత్తులు చేపట్టండి
### - కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులు రెడ్డి



గూడూరు రూరల్, డిసెంబర్ 22, ప్రభాతవార్త
గూడూరు – గిద్దలూరు రోడ్డు మార్గంను మరమ్మత్తులు చేయండి అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2014వ సంవత్సరం ముందు వేసిన రోడ్డును మరమ్మత్తు పనులు చేయకుండా ఇప్పటి వరకు ఆ ప్రాంతంలో ఉన్న 15 గ్రామాలు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ప్రతి రోజు దాదాపు 7 వేల మందికి పైగా ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తుంటారు. విద్యార్థులు, ఉద్యోగులు, కర్షకులు, కార్మికులు, రైతులు రాకపోకలు సాగించలేక నానావస్థలు పడుతున్నారన్నారు. మే 5, 2025 గూడూరు సబ్‌కలెక్టర్‌కి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, వారికి అర్జీ సమర్పించి రోడ్డు బాగుచేయాలని కోరగా వారు 4 కోట్ల 50 లక్షల రూపాయలతో రోడ్డు మరమ్మత్తు పనులు చేసినట్లుగా మాకు చెప్పడం జరిగిందన్నారు. రోడ్డుకు సంబంధించి గత 10 సంవత్సరాలు పైగా ఇప్పటి వరకు మరమ్మత్తు పనులు చేపట్టిన దాఖలాలు లేవు.

## పండుగ వాతావరణంలో సైకం జయచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు



తిరుపతి రూరల్, డిసెంబర్ 22 ప్రభాతవార్త:
రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ మాజీ చైర్మన్, ప్రముఖ వ్యాపారవేత్త సైకం జయ చంద్రారెడ్డి జన్మదిన వేడుకలు తిరుపతిలో పండుగను తలపించేలా ఘనంగా నిర్వహించారు. సోమవారం తిరుపతిలోని ఆయన నివాసంలో జరిగిన ఈ వేడుకలకు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పార్టీలకు అతీతంగా పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు ఈ వేడుకల్లో పాల్గొని సైకం జయచంద్రారెడ్డికి పుష్పగుచ్చాలు అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ....చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే తల్లి బృందమ్మ, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, అశోక్ రాజు, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తదితరుల పాల్గొన్నారు.

## అప్పలాయగుంటలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

వడమాలపేట, డిసెంబరు 22 ప్రభాతవార్త: వైకుంఠ ఏకాదశి, నూతన సంవత్సర పర్వదినాలను పురస్కరించుకుని అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కోవిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఉదయం తిరుప్పావై సేవ అనంతరం టీటీడీ అధికారులు, అర్చకులు, సిబ్బంది శుద్ధి కార్యక్రమాలు చేపట్టారు. గర్భాలయం, ధ్వజస్తంభం, శ్రీదేవి, భూదేవి ఆలయాలు, బేడీ ఆంజనేయ స్వామి ఆలయంలోను శుద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దేవరాజులు, ఆలయ అధికారి ఏ.వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, ఆలయ ప్రధాన అర్చకులు సూర్య కుమార్ ఆచార్యులు, మణికంఠ స్వామి, రమణాచార్యులు హెల్త్ ఆఫీసర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.